# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు.**

**2. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.**

**3. ఈ నెల 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకువస్తున్నట్లు రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

**4. రాబోయే వంద రోజుల్లో 1.28 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

**5. సాంకేతిక పనుల కారణంగా విజయవాడ పరిధిలో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు కొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.**

**6. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి ఈరోజు.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి ఆర్థికసాయం, ఇతర అంశాలపై ప్రధానమంత్రితో చర్చించారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అంతకుముందు రాష్ట్రానికి చెందిన ఎన్డీయే పార్లమెంట్ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి సమావేశమై ఆయనతో వివిధ అంశాలపై చర్చించారు. కాగా ఈ మధ్యాహ్నం కేంద్రమంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమవుతారని, సాయంత్రం కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, హర్దీప్ సింగ్ పురీతో చంద్రబాబు సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులు అర్పించారు. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా 1922లో రంప తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గొప్ప విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు అని గవర్నర్ పేర్కొన్నారు.

సీతారామరాజు దార్శనికత, బోధనలు రాబోయే తరాలకు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు. గిరిజనులను స్వాతంత్ర్య సంగ్రామానికి సమాయత్తం చేసిన ఆ మహనీయుడి స్ఫూర్తితో పురోగమించాల్సిన అవసరం ఉందని, ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. యస్ జగన్మోహన్ రెడ్డి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమర యోధుడు.. బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలబడిన విప్లవ వీరుడు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన నాయకుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు.

---------------------------

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో సీతారామరాజు స్వగ్రామమైన మోగల్లులో అల్లూరి సీతారామరాజు 127 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు పాత్రికేయులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా మొగల్లు కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. 125 జయంతి వేడుకలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భీమవరంలో ప్రారంభించడం వల్ల సీతారామరాజు కీర్తి దేశ ప్రజలకు తెలిసిందని అన్నారు.

అల్లూరి సీతారామరాజు పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమైనదని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కుప్పంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. స్వాతంత్ర సమరంలో విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయమైన పాత్ర పోషించారని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కమిషనర్ అతిథి సింగ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు కొనసాగించిన విప్లవ పోరాటం తెలుగు జాతి చరిత్రలో క్రియాశీలక ఘట్టమని శ్రీ సత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సంయుక్త కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నిన్న అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, ఉచిత ఇసుక పంపిణీకి విధివిధానాలు తయారు చేస్తున్నామని, కలెక్టర్ల అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ ఆధ్వర్యంలో లోడింగ్, రవాణా ఛార్జీలు నిర్ణయించనున్నామని తెలిపారు. ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తామని, ఇసుక పంపిణీపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాబోయే వంద రోజుల్లో 1.28 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి

కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిన్న మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న 6.75 లక్షల గృహాలను మార్చి నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 8.04 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని పూర్తి చేయడానికి 2 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని చెప్పారు. లబ్ధిదారుల పేర్లపై నిర్మాణ సామగ్రిని అధికంగా తీసుకున్నారని, వీటిపై విచారణ చేసి.. ఈ నెల 31 లోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంనేయస్వామి అన్నారు. నిన్న ఒంగోలులోని బధిరుల పాఠశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను మంత్రి తనిఖీ చేసారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆద్వర్యంలో డియస్సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొంటూ..

వాయిస్ (26 సెకన్లు)

---------------------------

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా పలు రైళ్ళను రద్దు చేయడంతో పాటు కొన్నింటిని దారి మళ్లించినట్లు విజయవాడ రైల్వే పౌర సంబంధాల అధికారి నుస్రత్ మండ్రుప్కర్ తెలిపారు. గుంటూరు– సికింద్రాబాద్, బిట్రగుంట– చెన్నై సెంట్రల్, విశాఖపట్నం– కడప సహా మరికొన్ని రైళ్లను ఆగష్టు నెలలో నిర్దేశిత తేదీలలో రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే సికింద్రాబాద్–విశాఖపట్నం, నిజాముద్దీన్–విశాఖపట్నం, షాలిమార్–హైదరాబాద్ సహా మరికొన్ని రైళ్లను దారి మళ్లించామని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ పతాక రూపశిల్పి... పింగళి వెంకయ్య వర్ధంతి ఈరోజు. యావత్ భారతదేశం గౌరవించే జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య... 1876, ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ 1921 మార్చి 31, ఏప్రిల్ 1న విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆ తర్వాత ఆ పతాకానికి కొద్దిగా మార్పులు చేశారు. గొప్ప దేశభక్తుడు, భూగర్భ శాస్త్రవేత్త, రచయిత అయిన పింగళి వెంకయ్య భారతదేశానికి ఒక జాతీయ పతాకం' అనే పుస్తకాన్ని రచించారు. పింగళి వెంకయ్య అందించిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2009లో ఆయన గౌరవార్థం తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఆయన 1963 జూలై 4వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. నిన్న కృష్ణా జిల్లాలోని మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామికవాడల్ని గన్నవరం శాసన సభ్యులు వెంకట్రావుతో కలిసి ఆయన సందర్శించిన అనంతరం పారిశ్రామికవేత్తలు, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. మల్లవల్లి పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యలను

పరిష్కరించి, రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గతంలో పెంచిన భూముల ధరలను తగ్గించి, కొత్త పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు.

---------------------------

తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా వెంకటేశ్వర్ ఈరోజు తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని ప్రజలకు సేవలందిస్తామని తెలియజేసారు. అలాగే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ.ఆనంద్ ఈరోజు బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పని చేస్తామని తెలిపారు. గతంలో గూడూరు సబ్ కలెక్టర్‌గా పని చేయడం వల్ల జిల్లా పై అవగాహన ఉందని చెప్పారు.

======================